క్లుప్తంగా

అప్రమత్తత అవసరం
- ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



దుబ్బాక: భారీ వర్షాలు పడుతున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలతో ఎలాంటి నష్టం జరుగకుండా ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రాకూడదని, అన్ని రకాలుగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భారీ వర్షాలతో చెరువులు, కుంటలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయని, రైతులు తమ పొలాల వద్ద ఉన్న విద్యుత్ తీగల విషయంలో అప్రమత్తంగా ఉండాలని కోరారు. వర్షాలకు ఇళ్లు కూలిన బాధిత కుటుంబాలకు అధికారులు పునరావాసం కల్పించాలని, ప్రమాదకరంగా ఉన్న ఇళ్లలో ప్రజలు ఉండవద్దని సూచించారు.

మర్యాద పూర్వక కలయిక



మున్సిపల్ చైర్‌పర్సన్‌తో ఆశ్రిత్ కుమార్

సిద్దిపేటజోన్: మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై వచ్చిన ఆశ్రిత్ కుమార్ ఆదివారం మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రాజనర్స్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు వర్షాల గురించి చర్చించారు. బల్దియా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ విజేత కీర్తి



విద్యార్థిని కీర్తి

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి హైస్కూల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని కీర్తి రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ క్రీడలో మొదటి రౌండ్‌లోనే విజేతగా నిలిచింది. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో ఆదివారం సబ్ జూనియర్ బాలికల విభాగం రాష్ట్రస్థాయి క్రీడలు ప్రారంభమయ్యాయి. ఈ క్రీడలో వరంగల్ జిల్లాపై మొదటి రౌండ్‌లోనే విజేతగా నిలిచింది. దీంతో హెచ్‌ఎం సత్తయ్యతో పాటు ఉపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్ రాజ్‌కుమార్ కీర్తిని అభినందించారు.

కొత్త పెన్షన్ వద్దు..



నిరసన తెలుపుతున్న నాయకులు

హుస్నాబాద్: సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తూ సీపీఎస్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ఆదివారం అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన తెలిపారు. కొత్త పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మోహన్, రవి, శంకర్, సోములు, కాళిదాస్, తిరుపతి, మోహన్, రవి, వసంత్ పాల్గొన్నారు.

విద్యారంగంలో విశిష్ట సేవలు



సభ్యులను సన్మానిస్తున్న పాపిరెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యారంగం అభివృద్ధికి జిల్లా ట్రస్మ కమిటీ చేస్తున్న సేవలను గుర్తించి రాష్ట్ర కార్యవర్గం ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి విద్యా సదస్సులో జిల్లా ట్రస్మ సభ్యులను అభినందించారు. జిల్లా అధ్యక్షుడు గజ్జెల సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శి భాస్కర్, కోశాధికారి హరినాథ్‌ను రాష్ట్ర అధ్యక్షుడు పాపిరెడ్డి ఘనంగా సన్మానించారు.

అనారోగ్యంతో మాజీ ఎంపీపీ మృతి



శారద (ఫైల్)

కొండపాక(గజ్వేల్): మాజీ ఎంపీపీ అనంతుల శారద అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం హైదారాబద్‌లో మృతి చెందారు. 2002లో కొండపాక సర్పంచ్‌గా, 2006లో ఎంపీపీగా పని చేశారు. పలువురు రాజకీయ నాయకులు ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు.

ఉధృతంగా వాగులు వంకలు



ఇంద్రగూడెం వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

- ఎడతెరిపిలేని వర్షాలు
- జలమయమైన లోతట్టు ప్రాంతాలు
- రోడ్లపై పొంగి ప్రవహించిన వరద నీరు
- కూలిన చెట్లు, ఇళ్లు

సిద్దిపేటరూరల్: రెండు రోజులుగా కురుస్తున్న అధిక వర్షాలకు నారాయణరావుపేట, సిద్దిపేట రూరల్ మండలాల పరిధిలోని పలు గ్రామాల్లోని చెరువులు, కుంటలు నిండుకుండలా మారాయి. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కురిసిన భారీ వర్షానికి చెరువులు, కుంటలు పొంగి ప్రవహించాయి. రూరల్ మండల పరిధిలో మొత్తం ఏడు ఇళ్లు కూలిపోగా, పుల్లూరులో రోడ్డు కారణంగా ఆరు ఇళ్లలోకి నీళ్ళు వచ్చిచేరడంతో స్పందించిన డీటీ రాజేశం, ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి జేసీబీ సాయంతో నీటిని తొలగించి సమస్యను పరిష్కరించారు. రాఘవాపూర్ నుంచి రావురూకుల వెళ్ళే రోడ్డు, మల్యాల నుంచి పుల్లూరు వెళ్ళే రోడ్డు, రాంపూర్ వద్ద రోడ్డుపై నుంచి వరద నీరు పొంగి ప్రవహించడంతో రోడ్లు ధ్వంసం కాగా, కొద్ది సేపు రాకపోకలు నిలిచిపోయాయి. తోర్నాల వద్ద రోడ్డుకు అడ్డంగా చెట్టు పడిపోవడంతో వెంటనే స్పందించిన ఎస్ఐ అపూర్వరెడ్డి సిబ్బందితో కలిసి రవాణాకు ఎలాంటి అంతరాయం కలగకుండా చెట్టును తొలగించారు. నారాయణరావుపేట మండల వ్యాప్తంగా నాలుగు ఇళ్లు కూలిపోగా, మల్యాల చెరువులోకి వెళ్ళే వడ్లోనికట్ట తెగి మూడు ఇళ్లలోకి నీళ్ళు చేరడంతో ఆర్ఐ అర్జున్‌రెడ్డి ఆ బాధితులకు గంగపుత్ర సంఘం భవనంలో పునరావాసం కల్పించారు.



మల్యాలలో ఇళ్లలోకి చేరిన నీరు



మాటిండ్ల నక్కవాగు మత్తడి పొంగడంతో చేపలు పడుతున్న స్థానికులు

రాఘవాపూర్‌లో అత్యధిక వర్షం

రూరల్ మండల పరిధిలోని రాఘవాపూర్‌లో ఆదివారం రాత్రి నుంచి సోమవారం మధ్యాహ్నం వరకు ఎడతెరిపి లేకుండా ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో గ్రామంలోని మూడు కుంటలు, పెద్ద చెరువు నిండుకుండల్లా దర్శనమిస్తున్నాయి. జిల్లాలోనే రాఘవాపూర్‌లో అధిక శాతం వర్షపాతం నమోదైంది.



హుస్నాబాద్: వరద నీటిలో బాటసారుల కష్టాలు



గజ్వేల్‌రూరల్: మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్న సంచార ప్రజలు



సిద్దిపేటజోన్: ద్విచక్ర వాహనాలపై కూలిన గోడ



మద్దూరు(హుస్నాబాద్): కూటిగల్ నల్ల చెరువులో..



మద్దూరు(హుస్నాబాద్): గాగిళ్లాపూర్‌లో కూలిన ఇల్లు



దుబ్బాకటౌన్: రాయిపోల్‌లో జలమయమైన కాలనీ



వరుద నీటిలో మునిగిన బోర్లు, పంట పొలాలు



నంగునూరు(సిద్దిపేట): ఉధృతంగా ప్రవహిస్తున్న మోయతుమ్మెద వాగు



హుస్నాబాద్: నాగారం రోడ్డులో దుకాణాల్లోకి చేరిన వరద నీరు



గజ్వేల్‌రూరల్: జాలిగామలో ఇళ్లలోకి చేరిన నీరు



జగదేవ్‌పూర్(గజ్వేల్): మునిగడపలో పెద్ద చెరువు..



గజ్వేల్‌రూరల్: రైల్వే బ్రిడ్జి కింద నిలిచిన నీరు

సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి
- సిద్దిపేట సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీపీ అనురాధ సూచించారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ.. వర్షాల వల్ల గ్రామాల్లోని చెరువులు, కుంటలు నిండి పారుతున్నాయని ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వర్షపు నీటిలో నుంచి ఎవరూ రోడ్డు దాటకూడదని చెప్పారు. పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

అందుబాటులో ఉండండి..
- మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్

సిద్దిపేటజోన్: వర్షాల కారణంగా మున్సిపల్ పరిధిలోని అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ ఆదేశించారు. ఆదివారం ఆయన పట్టణంలో పలు ప్రాంతాల్లో పరిశీలించారు. డంపుయార్డ్‌ను సందర్శించి సేంద్రియ ఎరువుల తయారీ, బయోగ్యాస్ ప్లాంట్ గురించి ఆరా తీశారు. అదేవిధంగా ఇర్కోడ్ వద్ద స్లాటర్ హౌస్, హౌసింగ్ బోర్డ్ డీఆర్సీ కేంద్రం, ఆయా వార్డుల్లో ఉన్న కంపోస్టు యూనిట్‌లను పరిశీలించి వివరాలు సేకరించారు. లోతట్టు ప్రాంతాలను పరిశీలించి నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట శానిటరీ విభాగం అధికారులు సతీశ్, మాధవి, వనిత, టౌన్ ప్లానింగ్ అధికారులు ఉన్నారు.

నీరు వృథా పోకుండా..



ఖమ్మంపల్లి ఏనె చెరువులోకి నీరు వెళ్లేలా చేపడుతున్న పనులు

కొండపాక(గజ్వేల్): మండలంలోని ఖమ్మంపల్లి గ్రామ శివారులో వర్షపు నీరు వృథాగా పోకుండా రైతులు తమ సొంత ఖర్చులతో చెరువును నింపేలా చర్యలు చేపట్టారు. తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి కాలువ ద్వారా పలు గ్రామాల చెరువులను నింపేందుకు కొన్నేళ్ల కిందట బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టి అసంపూర్తిగా వదిలేసింది. దీంతో ఖమ్మంపల్లి, మర్పడ్గ తదితర గ్రామాల చెరువులకు నీరు చేరడం లేదు. ఈ విషయాన్ని పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోలేదు. దీంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు నీరు వృథా పోకుండా రైతులు కొంతం మల్లయ్య, తోట్ల నర్సింహులు తమ సొంత ఖర్చులతో జేసీబీ సహాయంతో ఖమ్మంపల్లి గ్రామ ఏనె చెరువులోకి వెళ్లేలా చేశారు. ఈ చెరువుకు సుమారు 150 ఎకరాల ఆయకట్టు ఉంది. ఆ రైతులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.



కొమురవెల్లి(సిద్దిపేట): అలుగు పారుతున్న గురువన్నపేట కామునిచెరువు



పిడుగుపాటుకు బెజ్జంకిలో మృతి చెందిన గేదె



గాగిల్లాపూర్ మోయతుమ్మెద వాగులో ప్రవహిస్తున్న వరద



నంగునూరు(సిద్దిపేట): పరిశీలిస్తున్న ఏసీపీ



దుబ్బాకలో నీటి మునిగిన వరి పంట



వర్గల్(గజ్వేల్): శాల నర్సవ్వ ఇంట్లోకి చేరిన వరదనీరు



చేర్యాల(సిద్దిపేట): ఆదిఆంజనేయస్వామి ఆలయంలో వర్షం నీరు



కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లిలో నీటమునిగిన పంటలు

సంక్షిప్త వార్తలు

◆ జిల్లావ్యాప్తంగా వైఎస్‌ఆర్ వర్ధంతి

సిద్దిపేటఅర్బన్: దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 15వ వర్ధంతిని జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని వైఎస్సార్ అభిమాని, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు తడక జగదీశ్వర్‌గుప్తా ప్రజలు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రిగా పేద ప్రజల సంక్షేమం, అభ్యున్నతి కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టి ప్రజారంజక పాలన అందించారని గుర్తు చేశారు. ఉమ్మడి ఏపీలో 86ప్రాజెక్టులు ప్రారంభించి అపర భగీరథుడిగా పేరు తెచ్చుకున్న దివంగత మహానేత దూరమై 15సంవత్సరాలు కావస్తున్నా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా సజీవంగా నిలిచి ఉన్నారన్నారు.

◆ ఎస్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం

కొండపాక(గజ్వేల్): ఎస్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు యడవల్లి వెంకటస్వామిని ఆదివారం హైదారాబాద్‌లో సిద్దిపేట జిల్లా ఎస్‌ఎస్‌యూఐ కార్యదర్శి కొమ్ము భానుచంద్ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల వెంకటస్వామి రాష్ట్ర అధ్యక్షుడిగా నియామకమయ్యారు.

◆ అంబేడ్కర్ ఫంక్షన్ హాల్ ప్రారంభం



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని 2వ వార్డు నర్సాపూర్‌లో అంబేడ్కర్ ఫంక్షన్ హాల్‌ను ఆదివారం మున్సిపల్ చైర్మన్ మంజుల ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్ నాయిని చంద్రం, మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, మాజీ చైర్మన్ కడవేరుగు రాజనర్సు, బెల్లె రాములు, రాజమల్లు, బెల్లె ఎల్లయ్య, మాజీ కౌన్సిలర్ నర్సింహులు, కోరే ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ చికిత్స పొందుతూ మృతి



గజ్వేల్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన గజ్వేల్‌లో చోటు చేసుకుంది. ఆదివారం సీఐ సైదా తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని రిమ్మనగూడ సమీపంలో శనివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి గాయపడ్డాడు. స్థానికులు సమాచారం అందించడంతో పోలీసులు చేరుకుని అతడిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఆ వ్యక్తి భిక్షాటన చేస్తున్నట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. వయసు 65 నుంచి 70ఏళ్ల మధ్య ఉంటుందని, గోధుమరంగు టీషర్టు, నీలిరంగు లుంగీ కట్టుకొని ఉన్నాడని, ఎవరైనా గుర్తించినట్లయితే 87126 67331, 87126 67460 నంబర్లకు ఫోన్‌చేసి సమాచారం అందించాలని సీఐ సూచించారు.

◆ నేడు విద్యాసంస్థలకు సెలవు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా సోమవారం ప్రభుత్వ,ప్రైవేట్ విద్యా సంస్థలకు సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖధికారి శ్రీనివాసరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో కురుస్తున్న వర్షాల కారణంగా కలెక్టర్ ఆదేశాల మేరకు సెలవు ప్రకటిస్తున్నట్లు తెలిపారు.

◆ అధికారులు పర్యవేక్షించాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేటలో కురుస్తున్న వర్షం వల్ల నియోజకవర్గ రైతులు, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ సూచించారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షం వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు పర్యవేక్షించాలని కోరారు. కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు గ్రామంలో పర్యటించి ప్రజలకు సహకరించాలని పిలుపునిచ్చారు.

◆ ఉత్తమ సేవా అవార్డు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని ఖాజాపూర్ గ్రామానికి చెందిన సానీక్ష ఫౌండేషన్ చైర్మన్ ధరవత్ శివకు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉత్తమ సేవా అవార్డు, ప్రశంసాపత్రం అందజేశారు. ఆదివారం హైదారాబాద్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో వర్క్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు శివకు ఉత్తమ సేవా అవార్డు, ప్రశంసాపత్రం అందజేశారు. వర్క్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు తన్వీర్ అహ్మద్‌ఖాన్, రాష్ట్ర కోఆర్డినేటర్ ముస్తాఫా తదితరులు శివను ఘనంగా సన్మానించారు.